

# కథా కౌముది

## ఈ ఒక్కటి చెప్పలేదు  పాలగుమ్మి రామకృష్ణారావు



పిడపర్తి వెంకటరమణశర్మగారి జ్ఞాపకార్థం కౌముది నిర్వహించిన కథల పోటీ (2023)లో బహుమతి పొందిన కథ

స్పర్శ్ హాస్పైస్ రెండవ అంతస్తు 5వ నెంబరు గదిలో శారదతో నేను, కాదు, మేం ఇద్దరం.

ఇది హైద్రాబాదులో ఒక పెద్ద సేవాసంస్థ నడుపుచున్న ఉపశమన సంరక్షణ కేంద్రం. పేరొందిన కేన్సర్ ఆస్పత్రులకు వీడ్కోలు చెప్పి వారం రోజుల క్రితమే శారదను ఇక్కడకు తీసుకువచ్చాము.

“ఆ హాస్పిటలును ఎందుకు వదిలిపెట్టాం?” అని మొదటిరోజు శారద అడిగితే నేను చెప్పిన సమాధానం “పిల్లలు ఇదే మంచి ఆసుపత్రి అన్నారు. వాళ్ళు మళ్ళీ వెళ్లిపోవాలట. ఉద్యోగాలకు ఇబ్బంది. మనిద్దరం కలసి ఉండొచ్చు ఇక్కడ. డాక్టర్లు, నర్సులు అందరు నిన్ను బాగా చూసుకుంటారు. ఇంటిదగ్గరైనా ఇద్దరమే కాదా!”

ఇద్దరం అన్న మాటే శారద ఇష్టపడుతుంది. మా మధ్య రహస్యాలుండవు. దాచిపెట్టడం మోసం చెయ్యడంకిందే భావిస్తుంది శారద.

నేను శారదకు నిజం చెప్పకపోవడం ఇదే మొదటిసారి. నిజాన్ని మనసులోనే తొక్కిపెట్టి పైకి అమాయకంగా, ఏం తెలియనివాడిలా మాట్లాడుతో ఆమె మోహంలో భావాలను వెతుకుతోనే వున్నాను.

శారద ఒక్కోసారి కళ్ళు చిట్లిస్తుంది, అంతలోనే నీరసంతో కూడి పెదవులను విడిచి రాలేని ఒక నవ్వు నవ్వుతుంది.

శారదను ఇక్కడ జాయిన్ చేసిన రెండో రోజే చిన్నమ్మాయి సిరి అమెరికా తిరిగి వెళ్ళిపోయింది. గది గుమ్మం దాటే ముందు అంది "తిరిగి నేను అంత దూరం నుండి రాగలనో లేదో, అమ్మకు నేను చేసుకునే సేవ ఇక్కడితో… "

సిరికి తప్పనిసరి ప్రయాణం. జీవన మార్గంలో ఉద్యోగం ప్రేమానుబంధాలకు అడ్డుగీత గీసింది.

అమ్మకు మందులు ఎపుడు వెయ్యాలి, ఆహారం ఎలా ఇవ్వాలి, డాక్టర్లు ఎప్పుడువస్తారు, కేంటీన్ ఎక్కడ వుంది?" ఇలాంటివన్నీ నాకు చెప్పడానికి, ఈ వాతావరణం నాకు అలవాటు చెయ్యడానికి పెద్దమ్మాయి మంజు మరో నాలుగు రోజులు వుంది.

మంజు సింగపూర్ వెళ్ళిపోవాలి. పిల్లలకు పరీక్షలు వస్తున్నాయి, భర్త ఇబ్బందిపడుతున్నాడు. తప్పనిసరి. ఏం చెయ్యలేని పరిస్థితి.

"శారదా! మంజు ఈ రోజు వెళ్ళిపోతోంది."

"అమ్మా! వెళ్ళనా? పిల్లలగురించి వెళుతున్నాను. నాన్న ఎప్పుడు ఫోన్ చేసినా వచ్చేస్తాను. బెంగపెట్టుకోకు." శారద అలాగే అన్నట్లుగా తల కదిపింది.

గేటువరకు దిగబెట్టి వచ్చేస్తాను." అన్నాను.

"త్వరగా వచ్చెయ్యండి."

"బయటనుండి నీకేమైనా తీసుకురావాలా? యాపిల్, బత్తాయి, ఫ్రూట్ జ్యూస్ –"

"నిన్ననే చెప్పాను మీకు. నాకొక నోటుబుక్కు, పెన్ను తీసుకురమ్మని."

"అమ్మా నేను తెచ్చాను. నీకివ్వడం మర్చిపోయాను. ఇదిగో" అంటూ తన బ్యాగులోంచి తీసి ఇచ్చింది మంజు.

అమ్మ మొహం వెలిగిపోయింది. ఒక్క నిజం ఏవిటంటే పిల్లలతోబాటు నాకూ 'అమ్మ, అమ్మకు, అమ్మకోసం' మాటలు అలవాటైపోయాయి. నాకన్నా చిన్నదైన శారద 'అమ్మ' మాటతో ఎంతో పెద్దదైపోయింది. జీవన పోరాటంలో అమ్మ ముందుంది. నేను వెనుకుండిపోతున్నాను.

మంజును ఆటో ఎక్కించి వీడ్కోలు చెప్పి కనుచూపు దాటగానే కుప్పకూలిపోయాను. "ఏం సార్! మేడంకు సీరియస్ గా వుందా?" అన్నారు సెక్యూరిటీ భుజం మీద చేతులు వేసి.

ఏం చెప్పను? అందరూ అమ్మను నాకప్పగించి వెళ్లిపోయారు. సారీ! నా శారదను నాకప్పగించారు. ఇప్పటినుండి నేను, శారద. ఎన్నాళ్ళో! కళ్ళు తుడుచుకొని లోపలకు వచ్చేసాను.

శారద బెడ్డు వెనుకకు జరిగి కూర్చుంది. పుస్తకం తెరచి రాసుకుంటోంది.

"నిన్ను ఎవరు కూర్చోబెట్టారు?"

"ఆయా వచ్చింది."

"అప్పుడే మొదలుపెట్టావా కథ?"

"చాలా కాలమైంది పెన్ను పట్టుకుని." నేను అడిగినదానికి బదులుగా కొత్త జవాబిస్తుంది.

"రెస్టు తీసుకోక ఇప్పుడు కథలు రాయడమెందుకు?"

"____"

"సరే ఏం కథా?"

"తెలీదు."

శారద కొంత పేరు సంపాదించిన రచయిత్రి. చాలా కథలే ప్రచురింపబడ్డాయి. తను రాయబోయే కథ సారాంశం ముందుగా నాకు చెప్పేది. నేను ఎదో సలహా ఇచ్చేవాడినని కాదు. తన మనస్సులో దృఢమైన ముద్ర వేసుకోవడానికి మాత్రమే.

ఇప్పుడు రాయబోయేది తనకే తెలియదంటోంది. శారద పూర్తిగా చిక్కిపోయి శల్యంలా వుంది. మెదడుకు పూర్తిగా ఆలోచించే శక్తి లేదు. ఏం రాస్తుంది? తనకు తెలిసిన విద్య మర్చిపోతానన్న భయంతో కలాన్ని పట్టుకుందేమో అనిపిస్తోంది.

ఒక అరగంట గడిచింది. పుస్తకం మడచి దిండుకింద పెట్టుకుంది. "నన్ను మాములుగా పడుకోబెట్టండి. నడుం లాగుతోంది." అంది.

శారదను బెడ్డుపైన సరిగ్గా పడుకోబెట్టాను. "ఏం రాసావు? చూపించు."

"ఇప్పుడు కాదు. పూర్తి అయ్యాకా ఇస్తాను. దాన్ని మీరే ఫెయిర్ చెయ్యాలి. నాకు ఓపిక లేదుకదా!"

"ఒక్క పదిహేను రోజులాగు. నీకు పూర్తి ఓపిక వస్తుంది. ఇంటికి వెళ్లిపోయాకా నీకు నువ్వే అన్ని చేసుకోవచ్చు."

"ఇంటికి వెళ్ళిపోతే అస్సలు టైముండదు."

"ఎందుకు ఉండదు? నాకు వంట వచ్చుగా. పిల్లలు లేకపోయినా ఇంటి సంగతి నేను చుసుకోగలను. హ్యాపీగా నీకు తోచినన్ని కథలు రాసుకోవచ్చు."

నమ్మకాన్ని బలంగా అందించడం ఒక కళ. శారద కళ్ళలోకి చూసాను.

శారద తలను అంగీకారంగా కదిలించింది. "మీకు వంటవచ్చు, నిజమే. పిల్లలు దగ్గర లేకపోయినా ఒంటరిగానైనా…"

"ఇక్కడ వుండేది పదిహేను రోజులే."

"అన్నాళ్ళుండాలా! ఇప్పుడు నేను బాగానే వున్నాగా! ఇంటికి వెళ్ళిపోదాం."

"లేదు శారదా. నువ్వు నడవలేకపోతున్నావు. నీకు మామూలు నడక రావాలి. మనం ఇక్కడ ప్రత్యేకమైన గది తీసుకున్నాం. నాకొక బెడ్డు అనుకూలంగానే వుంది. ఆయాలు, నర్సులు, డాక్టర్లు నన్నుకూడా–నాకేమైనా శ్రద్ధగా చూస్తారు."

శారదకు ఈ విధంగా నా వయస్సును గుర్తు చేశాను.

"అవును. ముందు మీ ఆరోగ్యం బాగుండాలి. మీరు మంచాన పడితే నేను చూసే స్థితిలో లేనుగా. ఇక్కడే ఉందాంలెండి. నా సిరితల్లి హామీ ఇచ్చింది ఎంత ఖర్చైనా భరిస్తానని. మీరు ఇలా నా పక్కనుంటే చాలు. ఎక్కడైతే ఏమిటి." గంభీర స్థాయిలో మొదలుపెట్టిన మాటలు గట్టును తాకిన పలుచటి నీటి అలలా మారిపోయి శారదను నిద్రలోకి జార్చాయి.

అలసిన శారద ఆటవిడుపుగా నిద్రపోతోంది. నాకైతే అలుపనేది తెలియటం లేదు. నిద్ర రావటం లేదు. శారదను చూస్తోనే వున్నాను. ఎండిన పుల్లలా వుంది. కెమోథెరఫీతో జుట్టు మూడువంతులు రాలిపోయి, వున్న జుట్టు చిక్కులతో ముడివెయ్యడానికి కూడా ఆస్కారం లేకుండా పిచ్చిదానిలా కనపడుతోంది. కొన్ని నెలల క్రితం వరకు సాంప్రదాయ కట్టు, బొట్టుతో పదహారణాల తెలుగు తల్లిలా వుండే శారద ఇప్పుడు చీర, జాకెట్టు వేసుకోలేని స్థితిలో నైటీలో, చింపిరి జుట్టుతో, గతాన్ని మరిచిందో లేక ప్రస్తుతానికి తలవంచిందో, అర్థం కానీ నవ్వుతో డాక్టర్లను పలకరిస్తోంది.

వారం రోజులక్రితం వరకు నిరంతర స్కానింగులు, ఇంజెక్షన్లు, భరించలేని బాధతో అరుపులు. అవన్నీ ఆగి ఇప్పుడు ఇక్కడ ప్రశాంతమైన నిద్ర! శారదకు ఆశ్చర్యం వేస్తోంది. అంత గందరగోళమైన ట్రీటుమెంటు ఆగిపోయి ఒకటి రెండు మాత్రలతో ఎలావచ్చింది ఈ ప్రశాంతత!

నాకు తెలుసు. ఇది సునామి వచ్చేముందు ఏర్పడుతోన్న నిశ్శబ్దత.

రోజూ వైద్యబృందం వస్తుంది. "ఎలావుందమ్మా?" అని ప్రేమగా ప్రశ్నిస్తారు.

"ఆమె నవ్వుతో చెబుతుంది "బాగానే వుంది డాక్టరుగారు. నేను ఇంటికి వెళ్లిపోవచ్చా"

"కాళ్ల నెప్పులు తగ్గాయా?"

"కొద్దిగా వున్నాయి."

"తగ్గనీయండి. తప్పకుండా వెళ్లిపోదురుగాని. నిద్ర ఎలావుందీ?"

"రాత్రులు సరిగా లేదు."

"పగలు నిద్రపోతున్నారు, అవునా. పగలు మీ ఆయనతో చక్కగా కబుర్లు చెబుతో కాలక్షేపం చెయ్యండి. రాత్రి అదే నిద్ర వస్తుంది. నర్స్! శారదాగారికి రాత్రికి ఒక స్లీపింగ్ టాబ్లెట్ ఇవ్వండి. ఓకేనా అమ్మా. హ్యాపీగా వుండండి. మీకు ఏ బాధ వున్నా దాచుకోకుండా చెప్పండి. ఇంట్లో ఇబ్బందులేం లేవుకదా? మీ పిల్లలు ఏం చేస్తున్నారు?"

"పిల్లలు బాగున్నారండి. పెళ్లిళ్లు అయిపోయాయి."

"గుడ్ మీరు చాలా అదృష్టవంతులు. మీది చాలా హ్యాపీ లైఫ్."

ఇలాగే రోజూ శారదను సంతోషపెట్టి వాళ్ళు బయటికి వెళతారు. వెనకనే నేను వెళతాను. వరండాలో నేను శారద అడిగిన ప్రశ్నలనే మరో కోణంలో అడుగుతాను. "డాక్టరుగారు ఆవిడకు ఎలావుంది?"

"షి ఈజ్ ఒకే."

"ఇంకా నడవలేకపోతోంది?"

" ఆవిడను ఇక్కడ చేర్చేముందు ముక్కుద్వారా గొట్టాలు వేసి ఆహారాన్ని లోపలకు పంపేవారు. ఇప్పుడు మాములుగా తినగలుగుతోంది. మీరు వీల్ ఛైర్ లో ఆవిడను బయట తిప్పడం మేం చూస్తున్నాం. మంచం మీదనే ఒక పక్కనుండి మరో పక్కకు తిరగలేని రోగులు ఎంతో మంది వున్నారు. శారదగారు బెటరు. మనం ఉన్నదానిలో సంతోషాన్ని వెతుక్కోవాలి."

డాక్టర్లు నా భుజం తట్టుతారు నన్ను సంతోషపెట్టడానికి. నాకు తెలుసు, వాళ్లకు తెలుసు. ఏమీ తెలియని వాడిలా నా ప్రశ్నలు. వాళ్లు కొత్త ఉదాహరణలతో నన్ను సంతృప్తి పరుస్తారు.

★★★★★

నెల రోజులు మాకు తెలియకుండానే దొర్లిపోయాయి. వైద్యుల పర్యవేక్షణ బాగుంది. ఇక్కడి సిబ్బంది నిత్యం మా మంచి చెడులను తెలుసుకుంటున్నారు. సమయానికి ఉచితంగా ఆకలిదప్పులు తీరుస్తున్నారు. దగ్గర బంధువులు వచ్చి పలకరిస్తున్నారు. ఈ సంస్థ నిర్వాహకులు రోగుల మానసిక ఆనందం కోసం సాంస్కృతిక కార్యక్రమాలు తరచుగా నిర్వహిస్తున్నారు. కుల, మత బేధం లేకుండా అన్ని పండగలు మావే అవుతున్నాయి.

అయినా శారద వేసే ఆ ఒక్క ప్రశ్న అలాగే వుంది.

"చవితి వెళ్ళింది, దసరా వెళ్ళింది, దీపావళి వెళ్ళింది. మనం వెళ్లేదెప్పుడు?"

"ఇక్కడ కూడా మనం అన్ని పండగలు చేసుకుంటున్నాంగా! కొంచెం నీకు నడక వస్తే… "

"మీరు నన్ను అస్సలు నడవనీయటం లేదు."

"మరీ కొంచెం ఆహారం తీసుకుంటున్నావు. నీకు బలం కావాలి."

"ఏమయినా పళ్ళు ఉన్నాయా?"

ఏది లేదో అదే అడుగుతుంది నా మీద కోపం వచ్చినప్పుడు. "ఇప్పుడే తెస్తాను" అని బయలుదేరాను. కొద్ది దూరంలోనే పళ్ళ దుకాణం వుంది. బొత్తాయలు, ఆపిల్స్ తీసుకుని తిరిగి రావడానికి ఇరవై నిముషాలు పట్టింది.

ఈ కాస్త సమయంలోనే శారద సాహసం చేసింది. నా గుండె ఆగినంత పనైంది. నేలమీద చలనం లేనిదానిలా పడివుంది. ఒక పక్క సెలైన్ స్టాండు, మరోపక్క యూరిన్ బాగ్ విసిరేసినట్టున్నాయి.

శారద పిచ్చి చూపులు చూస్తోంది. వెంటనే కూర్చోబెట్టి, గుండెలకు హత్తుకుని పైకి లేపి బెడ్డుపైకి చేర్చాను. నాకు కళ్ళలో నీళ్లు కోపంతోను, బాధతోనూ వస్తున్నాయి.

"నన్ను దీనికేనా బయటకు పంపించావు?" అన్నాను కోపాన్ని అణచుకుంటూ.

"నడుద్దామని ప్రయత్నం చేశాను." మాటల్లో భయం కనపడింది.

ఆమె ప్రయత్నం తప్పని అనగలనా? వద్దని చెప్పగలనా?

రెండు నిముషాలు మౌనం మా మధ్య.

"నేను లేకుండా మరోసారి ఇలాంటి ప్రయత్నం చెయ్యద్దు. కొద్దీ రోజుల్లో నువ్వు తప్పకుండా నడుస్తావు. మనం వెళ్ళిపోతాం." శారదను భయం నుండి దూరం చెయ్యడానికి ప్రయత్నం చేస్తున్నాను. శారద మొహంపై చమటలు చూసాకా ఇప్పుడు నాకు భయం వేసింది. డాక్టరును పిలుచుకొచ్చాను.

" అమ్మా శారదగారు. మీరు నడుద్దామనుకుంటున్నారా! గుడ్. మంచి ప్రయత్నమే చేశారు."

డాక్టరు మాటలు నాకు ఆశ్చర్యాన్ని కలుగ చేశాయి.

"అయన నడవద్దంటున్నారు." నా మీద నేరంగా చెప్పింది.

"రావుగారు మీరు అలా చెప్పకూడదు. ఆవిడకున్న నడవాలనే కోరిక, ప్రయత్నం గొప్ప విషయం కదా! రేపు ఇద్దరు ఆయాలను పంపుతాను. వాళ్ళ సహాయంతో ఒక్కొక్క అడుగు ప్రయత్నం చెయ్యవచ్చు. ఇంక మీరేం కంగారు పడనవసరం లేదు. మీకు బెడ్ మీద ఏం తోచడం లేదా?"

డాక్టరుగారి మాటల్లో ప్రోత్సాహం నాకు అర్ధం అయింది. నేను చెప్పాను, "సార్ ఆవిడ రచయిత్రి. కథలు రాస్తుంది."

"వాట్! నిజమా! మాకింతకాలం చెప్పలేదేం రావుగారు?"

"ఇప్పుడు కూడా రాస్తోంది. చూడండి ఆవిడ పిల్లో కింద పుస్తకం." నేను నిజం చెప్పేసాను. శారద సిగ్గుపడింది.

"మీ కథలను చదివే భాగ్యం మాకు కూడా కలిగించండి. ఎప్పుడు మరో ఆలోచన లేకుండా ఈ స్టెతస్కోప్ పట్టుకు తిరిగే మాకు మీ రచయిత్రులనుండి నేర్చుకోవలసింది చాలా ఉంటుందని అనుకుంటున్నాను. మిమ్మల్ని ఇలా తెలుసుకోవడం నాకు చాలా ఆనందంగా వుంది మేడం!"

శారద పుస్తకాన్ని గుండెలకదుముకుని చెప్పింది. "మీరు నా కథలను అడిగినందుకు థేంక్స్ డాక్టరుగారు. అయన ఇస్తారులెండి. ఈ కథ పూర్తికాలేదు."

" కంటిన్యూ మేడం. పూర్తి అయ్యాకనే ఇవ్వండి. ఇప్పుడు మీరు ఓకేనా? నేను వస్తాను. కింద ఆఫీసులోనే ఉంటాం అందరం. ఎప్పుడు అవసరమైనా పిలవండి."

డాక్టరు వెళ్ళగానే కోపంగా అంది "ఎందుకు చెప్పారు?"

" నాకు లేని పేరు నీకుంది. అలా చెప్పుకోవడం నాకు గర్వగా ఉంటుంది. నా కోసమే చెప్పాననుకో. నాకు కూడా నీతోబాటు గౌరవం పెరుగుతుంది. ఈ కథ ఎంతవరకు అయింది?"

"చెప్పను. ఇదికూడా మీరు డాక్టరుగారికి చెప్పేస్తారు. బెడ్ పైకి లేపండి. కాసేపు రాసుకుంటాను."

శారదలో భయం పోయి మామూలు స్థితికి వచ్చింది.

★★★★

ప్రతి క్షణం శారదను అంటిపెట్టుకుని ఇలా రెండు నెలలు ఎలా గడచిపోయాయో నాకే తెలియటం లేదు. నాకళ్ళముందు ఎంతోమంది రోగులు రోదనతో ప్రవేశించారు, నిశ్శబ్దంగా వెళ్లిపోయారు. అందరితో పాటు శారద కూడా … ఇంటికి వెళ్లాలనే కోరికను నేను తీర్చలేకపోతున్నాను.

నలభై సంవత్సరాల పైబడిన మా వివాహ జీవితంలో పగళ్లు ఉద్యోగానికి, రాత్రులు నిద్రకు పోతే మనసు విప్పి మాట్లాడుకున్న రోజులు చాలా తక్కువ. ఇలా ఈ రెండు నెలల కాలం , ప్రతి క్షణం మాటలను కలుపుతో, మనసులను అర్థం చేసుకుంటూ, తిరిగిరాని అనుభూతిని మిగిల్చింది.

నాకీ తృప్తి చాలన్నట్లుగా ఇప్పుడు శారద మౌనంగా ఉంటోంది. మందుబిళ్ల కూడా నోటిలోకి పోవడం లేదు. సెలైన్ ఇంజెక్ట్ చెయ్యడానికి సిరలు కూడా దొరకటం కష్టం అయిపోయింది. సమయం దగ్గరపడిందన్నారు డాక్టర్లు.

పిల్లలు సిరి, మంజులకు ఫోన్ చేస్తే మరో రెండు రోజుల్లో వచ్చేసారు.

అంతిమ యాత్ర సుఖంగా వుండాలని డాక్టర్లు, నర్సులు ప్రయత్నం చేస్తున్నారు— చేశారు.

అయిపోయింది. నర్సులు బాడీని పాక్ చేస్తున్నారు.

గుండెలమీద పుస్తకం, దాన్ని గట్టిగా పట్టుకున్న చేయి. రెంటిని విడదీసి పుస్తకాన్ని నా చేతిలో పెట్టారు.

“శారదా ఇప్పుడు నేను చదవచ్చా?” మాటరాని మనసు ప్రశ్నించింది. శారద కాదనలేదు.. . అనలేదు.

కన్నీళ్లు బొట్లుబొట్లుగా జారి కాగితం పుటలమీద పడుతున్నాయి. అక్షరాలు జరిగిపోతున్నాయి. నాకు తోచిన మాటలను పట్టుకుంటున్నాను.

‘ఈ ఒక్కటి చెప్పలేదు. నా ప్రయాణం వేరుగా ఉందని నాకు తెలుస్తోంది. అయన తృప్తికోసం ఇంటికి వెళ్ళిపోదాం అని మాత్రమే అంటున్నాను.’

‘డాక్టరుగారు కథను అడిగారు. పూర్తిగాని కథ అని మాత్రమే చెప్పగలిగాను.’

‘పిల్లల పెంపకం, వంటిల్లుతో సంవత్సరాలు గడిచిపోయాయి. ఈ మిగిలిన కొద్దిరోజులు ఆయతో ప్రశాంతంగా గడపాలి. ముగింపు ఆయనకు తెలిస్తే తట్టుకోలేరు.’

ఇన్నాళ్లు నాకు తెలిసున్న నిజం నేనొక్కణ్ణే దాచిపెట్టానన్న భ్రమలో వున్నాను. అది ఆమె సంతోషం కోసం నేను చేసిన ప్రయత్నం. భవిష్యత్తు మీద నాకు లేని నమ్మకాన్ని ఆమెకు ఇస్తున్నాననుకున్నాను.

ఇదిగో శారద రెండు నెలల నా సంతోషం కోసం దాచిన నిజం ఈ కథ. ఇద్దరం ఒకరికోసం ఒకరు– ఈ ఒక్కటి చెప్పలేదు.

బాడీ స్ట్రెచర్ మీదకు మారి మార్చురీకి వెళ్ళిపోయింది.

ఇప్పటివరకు వెన్నంటే వున్నాను. ఉండిపోయాను.

★★★★

**COMMENTS**